# మల్లెపూలూ మాణిక్యాలూ

"నువ్వే కావాలి నాకు."

"అంటే?"

"నిన్ను పెళ్ళి చేసుకుంటాను, మణీ!"

ఫక్కున నవ్వింది మాణిక్యం. తెల్లబోయాను నేను. నా మాటలకు ఉబ్బి తబ్బిబ్బై పరవశిస్తుందనుకున్న మాణిక్యం పరిహాసంగా ఫక్కున నవ్వింది.

"తటవర్తి"



"ఎందు కా నవ్వు?" విసుక్కున్నాను.

"సినిమాలో హీరో చెప్పినట్టే చెప్పినావే చినబాబూ!"

"నోర్ముయ్!" నాలో అహం దెబ్బతింది. ఆవేశం పొంగివచ్చింది. మాణిక్యం చెంప ఛెళ్ళుమంది.

"చినబాబూ!" నిర్ఘాంతపోయింది ఆమె.

దెబ్బతిన్న ఆమె బుగ్గ బూరెలా పొంగింది. ముఖం మంకెన పువ్వులా ఎర్రనైంది. అందమైన ఆమె కళ్ళు అశ్రుపూరితాలయినాయి. గతక్షణంలో నవ్వుల పూలు వర్షించిన ఆ పెదవులే ముద్దమందార మొగ్గలా ముడుచుకొని కంపించిపోయాయి.

కొన్ని క్షణాలు స్తంభించిపోయాయి.

"కోపంగా ఉన్నావు. మళ్ళీ వస్తా, చినబాబూ!" బుగ్గ తడుముకుంట్కూ, కళ్ళు తుడుచుకుంటూ అలానే వెళ్ళిపోయింది మాణిక్యం. గొంతు పెగలని నేను అయోమయావస్థలో ఉండిపోయాను.

'నేను . . . నేను నా మణిని కొట్టానా! నా ప్రాణప్రియను హింసించానా!' అని స్పృహలోకి వచ్చి అనుకోటానికిముందే అంతా అయిపోయింది. ఒళ్ళు తెలియని కోపం ఎంత పనయినా చేయిస్తుంది!

ఆమె చిన్న పరిహాసానికి ఇంత పెద్ద శిక్షా! మనస్సు వికలమైపోయింది. నాపై నాకు వెర్రికోపం వచ్చి నా. ఆవేశానికి నాకే శిక్ష విధించుకోవాలనిపించింది. ఏ చేత్తో ఆమె చెక్కుటద్దాలను రక్తరంజితాలుగా

> **నిర్వ్యాపారత్వం**
>
> అఱిగి కఱిగిపోవడం మంచిదికాని, తుప్పుపట్టిపోవడం కానేకాదు.
>
> —కంబర్‌లాండ్

చేశానో ఆ చేతిని ముక్కలుముక్కలుగా నరకాలనిపించింది.

"మణీ!" అరుస్తూ బయటికి పరిగెత్తాను. మేడ కిందిమెట్టు చేరుకున్న మాణిక్యం దీనంగా తలెత్తింది.

"నిన్ను కొట్టాను కదూ! ఆ చేతి నిప్పుడే తెగ నరుకుతాను, మణీ!" అంటూ ఆవేశంతో తలుపు వైపు పరిగెత్తాను. ఆ పిచ్చి ఆవేశంలో నేను ఏం చేస్తున్నానో తెలుసుకునే స్థితిలో లేను. తలుపు సందులో చేతిని పెట్టి భడేల్‌మని తలుపు లాగేశాను. ఎముక విరిగిందో, కండ తెగిందో తెలియదు. చర్మం చిట్లి రక్తం చిందింది. "అబ్బా!" అని మూలిగాను.

సుడిగాలిలా వచ్చిన మాణిక్యం తలుపు భళ్ళున తోసేసి, "అయ్యో, అయ్యో, ఎంత పని చేశావు, చినబాబూ! నీ రక్తం కళ్ళచూశానా? ఈ ముదనష్టపు దానికోసం ఇంత శిక్ష వేసుకున్నావా?. . ." అని నా చేతిని చుట్టేసుకుని ఏడవ నారంభించింది.

అలా ఏడుస్తూనే నన్ను గదిలోకి తీసుకుపోయి తన చీర చెంగు పరపరా చింపి గబగబ చేతికి కట్టు కట్టేసింది. అల్మైరాలోని ప్రథమ చికిత్సకు సంబంధించిన వస్తువులన్నీ ఆమె తీసుకువస్తుంటే గజగజ వణికిపోతున్న ఆమె తన్మాలతను చూసి ఆశ్చర్యపోయాను. నాచేత చెంపదెబ్బ తినికూడా తొణకని ఆమె నా గాయాన్ని చూసి విలవిలలాడిపోతూంది.

'భగవాన్! నా మణిని నానుంచి దూరం చేయకు' అని మరోసారి దేవుణ్ణి ప్రార్థించాను.

గాయంమీద బోరిక్‌పౌడరు వేసి కట్టు కట్టింది. అంతసేపూ ఆమెవైపే చూస్తూండిపోయాను. ఆమె కన్నీటిధారల్ని చూసినకొద్దీ ఆమెపై నా ప్రేమ మరింత పొంగి పొరలెత్తింది. ఆమె శుశ్రూష నా గాయాన్ని మరిపించింది. ఆమె రాగస్పర్శ నా బాధను లుప్తపరిచింది. రెండేరెండు నా కన్నీటి బిందువులు ఆమె నీలి కుంతలాలపై పడి ఇంకిపోయాయి!

"ఎందు కింత పని చేశావు, చినబాబూ! ఇది చూసి నే నెలా బతకగలను? నా తల పగలగొట్టినా ఇంత బాధ పడుదునా?"

"ఇంకేమీ చెప్పకు. నేను చేసిన దుర్మార్గానికి నా కిది కావలిసిందే!"

"ఎంత పిచ్చివాడవు నువ్వు,చినబాబూ!"కన్నీళ్ళతోనే పేలవంగా నవ్వింది మాణిక్యం. "ఇదేమని పెద్దయ్యగారు, పెదబాబుగారు అడిగితే ఏమని చెప్పను? నన్ను చెంపదెబ్బ కొట్టినందుకు తాను చెయ్యి విరగగొట్టుకున్నాడని చెప్పితే . . . నా కీ ఇంట్లో ఇక నూకలుంటాయా? ఒక్కసారి ఇంత పిచ్చివాడివయిపోతున్నావేమిటి? ఏదివచ్చినా భరించలేని నువ్విఁకఎలాబతుకుతావయ్యా?" ఆమె గుండెల్లోంచి ప్రేమమాధురి, కన్నుల్లోంచి రాగసుధ, గొంతులోంచి కరుణావాహిని నాపై వర్షించి పులకింపజేస్తున్నాయి. అర్రులు చాచే ఆ అదృష్టమే అందీ అందక నన్ను ఆడిస్తూంది.

"అందుకనే నువ్వు నాకు కావాలి. నిన్ను వదిలి బతకలేను, మణీ!" అంటూ ఎడమచేత్తో ఆమెను చుట్టి నా ఒడిలోకి లాక్కున్నాను. "నాగురించి బాధపడేవాళ్ళు, నాకోసం కన్నీటిని వర్షించేవాళ్ళు నాకు కావాలి మణీ! కంటి తడి ఎక్కడ ఇంకిపోతుందో మనసులోని మమత లక్కడే హరించిపోతాయి! మూడు వారాలు జ్వరంతో మంచమెక్కిన నాకు తెలుసు, ఎవరు నిజంగా నాకోసం బాధపడ్డారో, ఎవరు రాత్రింబగళ్ళు తన్నుతాను మరిచి సేవ చేశారో!"

"యజమానికి సేవ చేయటం దాసీదాని ధర్మం కాదా, చినబాబూ! నేను పెద్దగా చేసిం దేముంది?"

"అలా మాట్లాడి నన్ను చిత్రవధ చేయకు, మణీ! నిన్నేనాడు నేనీ ఇంట్లో దాసీగా చూడలేదు. ఇంకెప్పుడూ ఇలాంటి మాట అనకు."

"బాధగా ఉందా, చినబాబూ!" అని మాట మార్చింది ఆమె నా చేతిని నిమురుతూ.

"లేదు, మణీ! నీలాంటి ప్రేమమయి సేవలో గాయమంత హాయి మరోటి ఉండబోదు."

"పిచ్చి బాబు! ఏమిటేమిటో అనుకుంటాడు" అని నవ్వి, "కాఫీ కలిపి తీసుకువస్తాను. కొంచెం అలా పక్కమీద పడుకో" అని నన్ను పడుకోబెట్టి ఫాన్ గాలి తగిలేలా సరిచేసి ఆమె గది తలుపులు దగ్గరగా వేసి వెళ్ళిపోయింది.

ఆమె కనుమరుగయిన క్షణంలో నా గాయపు బాధ కొంచెం తెలిసివచ్చింది. దాన్ని మరిచిపోదామని మనసుని మాణిక్యంతో నింపుకున్నాను. ఆమె తలపులతో మనసు మత్తుగా తూగి సోలిపోయింది.

మాణిక్యం మనసు స్వచ్ఛమయిన, పరిమళభరితమయిన మల్లెపువ్వువంటిది! మల్లెపువ్వంటే నాకు ప్రాణం!

ఆ క్షణంలో మల్లెపూల మాణిక్యం గుర్తుకువచ్చి ఒకసారి మనసు గతంలోకి పరిగెత్తిపోయింది.

* * *

మాతృప్రేమ అంటే ఏమిటో తెలియని నేను ఆయా చేతుల్లో పెరిగాను. ఎప్పుడూ వ్యాపార విషయాల్లో మునిగిఉండే నాన్నగారు, కాలేజీచదువు, స్నేహితులుతప్ప మరేమీ పట్టించుకోని అన్నయ్య నన్ను గాలికి వదిలివేశారు.

నేను గాలివాటుకి నీటిమీద తేలే గడ్డిపువ్వులా ఈ మహాసాగరంలో కొట్టుకుపోయాను. ఎన్నో మజిలీలు చేశాను. ఎన్నో అనుభవాలు చవిచూశాను. అవును! నేను ఆత్మీయత కొరవయిన ధనికులఇంట్లో అందరూ ఉండి, అనాథుడుగానే పెరిగాను.

నా బాగోగులు చూసేవారూ లేరు, నన్ను అడ్డు పెట్టేవారూ లేరు. నా ఇష్టప్రకారం చదివాను. ఆడి పాడాను. నాకు తెలియకుండానే పెరిగి పెద్దవాడినయ్యాను!

వదిన వచ్చింది. కనీసం ఇప్పుడయినా కరువయిన తల్లిప్రేమ లభిస్తుం దనుకున్నాను. ఆ ఆశా వృథా అయింది. క్లబ్బులమ్మట తిరిగే ఆవిడ, ఇంట్లో ఘోషాస్త్రీ! ఆమె నాతో మాట్లాడిన మాటలు వేళ్ళమీద లెక్కపెట్టవచ్చు. క్లబ్బులో పిల్లల పెంపకం మీద ఆమె ఇచ్చిన ఉపన్యాసంలో వందోవంతు అమలుజరిపినా నాకు తల్లిప్రేమ లభించిఉండేది.

అన్నయ్యకు పిల్లలు పుట్టినా, రక్తసంబంధంలోని ఆత్మీయత చేరువై ఉండేది నాకు. ఆ ఆశా తీరలేదు. ఆఫీసులో అన్నయ్యకు, క్లబ్బులో వదినకు ఆ ఆలోచన వచ్చిందో లేదో నాకు తెలియదు. బహుశా, తమ వ్యాపకాలలో వారి కీ (చిన్న) విషయం గుర్తుకు వచ్చి ఉండదు!

నా చుట్టు గిరి గీసుకొని నే నొక ప్రపంచంలో ఉండిపోయాను. నా చదువు, నా ఆటలు, నా స్నేహితులు—ఇదే నా లోకం. యాంత్రికంగా అన్నీ సాగిపోయాయి.

నాకు తెలియకుండానే నాలో యౌవనం అంకురితమయింది. నా తోటివాళ్ళతో ఆడపిల్లల్ని ఆట పట్టించాను. వెంబడించి విసిగించి వెర్రెత్తించాను. బంగారుపిచ్చుకనని తెలిసి నన్ను తమ వలయంలోకి లాక్కున్న వనితలు కొందరు! ఊపిరి సలపనివ్వని ఉవిదలు మరికొందరు!

అదయినా ఎంతవరకు వచ్చిందంటే, వాళ్ళ నందర్నీ ఏ "క్వాలిటీ"కో తీసుకుపోయి కడుపునిండా మెక్కబెట్టి బిల్లు చెల్లించటానికిమాత్రం ఉపయోగపడ్డాను. ఇదంతా ఓ నాగరికతగా మారిపోయిన ఈ రోజుల్లో నా స్నేహితుల్లో నా కనురాగాన్ని పంచిఇచ్చిన వాళ్లెవరూ కనిపించలేదు.

నా డబ్బునుకాక నన్ను ప్రేమించే వ్యక్తి నాకు కావాలి! సినిమాలకి, హోటళ్ళకికాక నన్ను అనుక్షణం అంటిపెట్టుకునుండే ఆత్మీయులు నాకు కావాలి! నా గురించి పరితపించిపోయే సహృదయత నాకు కావాలి. అహర్నిశలు అన్వేషించాను. ఎందరితోనో కలిసి తిరిగాను.

ఊహు! నా ఆశ ఎండమావిగానే నిలిచిపోయింది.

పిచ్చెత్తినట్లయి ఎక్కడికయినా పారిపోదామని పించింది. హృదయంలో లేని శాంతి ఎక్కడికి పోతే ప్రాప్తం లభిస్తుంది? అందరిలోనూ ఉండి అనాథుడి నయినందుకు నామీద నాకే కోపం, అసహ్యం కలిగాయి. అన్నీ మరిచిపోవాలని తప్పతాగాను. రాత్రిళ్ళు అదే పని చేసే నాన్నగారు నన్నొకసారి కేకలు వేశారు. అంతే! ఆ తరవాత ఆయనా పట్టించుకోలేదు.

వయస్సులో ఉన్నప్పుడు ఎవరూ పట్టించుకోని విషయంపై ఆసక్తి త్వరలో నశిస్తుంది!

ఓనాడు సినిమాహాల్లో పరిచయమైంది వారిజ అనే అందాలభామతో. నన్ను తన ఇంటికి ఆహ్వానించింది. నే నెవరో ఆమెకు తెలుసుట! అదును చూసి నన్ను ఆక్రమించుకుంది. కొత్తలో మోజు. శ్లేష్మంలో పడ్డ ఈగలా కొట్టుకున్నాను. ఆ తరవాత తెలిసింది పెళ్ళికాకముందు అన్నయ్యను అలరించిన అతివ ఆమేనని!

పతితుడినయ్యాను. నామీద నాకే అసహ్యం వేసింది. ఆ కూపంనుంచి బయటపడేసరికి కొన్ని నెలలు గడిచిపోయాయి. ఆమె మెడలో మరో రెండు నెక్లేసులు పెరిగాయి. బాంకు ఎక్కౌంటు ఎంత పెరిగిఉంటుందో ఆమె నామీద చూపే ప్రేమే చెప్పింది!

అక్కడి కో అధ్యాయం ముగిసింది.

నా క్లాసుమేటు శాంతకి అమాంతంగా నామీద ప్రేమ పుట్టుకువచ్చింది ఓ అశుభముహూర్తాన. నేనంటే పడి చచ్చిపోతున్నానంది. రోజూ రాత్రిళ్ళు నామీద తీయని కలలు కంటున్నానంది. ఎన్నెన్నో చెప్పింది. నిజంగా నామీద మత్తుమందు జల్లి నన్ను పిచ్చివాడిని చేసింది. ఆఖరికి నా గురించి పరితపించే వ్యక్తి దొరికిందని తృప్తి చెందాను. అవన్నీ గాలిమేడలని నాకు తెలియదు!

పెళ్ళిమాటలకని వాళ్ళ నాన్నగారు మా నాన్నగారి దగ్గిరికి వచ్చి ఆస్తిలో నాకు వాటా ఎంత వస్తుందని ఆరా తీసేసరికి శాంతకి దేనిమీద ప్రేమో నా కర్థమయింది! నా హృదయం ముక్కలయింది. పిచ్చిపట్టినదానిలా ప్రేమ-శ్లోకాలు వల్లించిన శాంత మరో బంగారుపిచ్చుకతో పార్కులో అదే టేప్‌రికార్డు చేసేసరికి నాకు మతి పోయినట్లయింది. ఆత్మీయు లెవరో, స్వార్థపరు లెవరో గుర్తించలేని నా అసమర్థతకు నామీద నాకే జాలి కలిగింది. నన్ను చూసి ప్రపంచమంతా పగలబడి నవ్వుతున్నట్లనిపించింది. నా చుట్టూ ఉన్నవాళ్ళు నన్ను గేలిచేస్తున్నట్లు కుమిలి పోయాను.

కొన్ని రోజులు భారంగా గడిచాయి. ఆఖరికి నా అన్వేషణ ఫలించింది!

నా జీవనరాగం మధురభరితమయిన రోజు వచ్చింది. స్కూటరు స్టాండులో పెట్టి పార్కులోకి నడిచాను. ఓ బెంచీమీద కూలబడి హృదయంలోని ఆవేదన మరిచిపోవాలని ఇసుకలో ఆడుతున్న పిల్లల ఆటల్ని తిలకిస్తున్నాను.

"బూట్‌పాలిష్!" సుపరిచితమైన గొంతు... పన్నెండేళ్ళ గోపి పాలిష్ బాగ్ తీసుకొని నావైపు వస్తున్నాడు. వాడి ముఖం చూడగానే నాలో ఉత్సాహం కలిగింది. ఒకనాటి సంఘటన తక్కున గుర్తుకు వచ్చింది.

ఇదే పార్కులో ఓనాడు కుర్రవాడు ముఖం వాడిపోయి ఓ నలభై యేళ్ళ ధనికుణ్ణి ప్రాధేయపడుతూ కనిపించాడు.

"రెండు రోజులుగా అమ్మకు గంజినీళ్ళు దొరకలేదు సార్! పాలిష్ చేస్తేకాని మాకు పొట్ట గడవదు, సార్! దయఉంచి మీ బూటుకి..." వాడు ప్రాధేయపడుతున్నాడు. అదికూడా తనకోసం కాదు... తన్ను కన్న తల్లి కడుపుకోసం!

"ఫో ఫో!" అని కసురుకున్నా డాయన. వాడు బతిమాలుతూనేఉన్నాడు. ఆఖరి కాయన విసిగెత్తినట్లు "ఫోరా, ముష్టివెధవా! ఈ అయిదు పైసలు తీసుకుపో" అని చేతిలో పెట్టబోయాడు.

ఆ కుర్రవాడి ముఖం పాలిపోయింది. "నేను ముష్టివాణ్ణికాదు సార్! కూలిపని చేసి పొట్ట పోసుకునే వాణ్ణి. పాలిష్ చేయించుకోనిదే డబ్బు లెలా తీసుకోను?"

అక్కడాయన, పది అడుగుల దూరంలో మరో బెంచిమీద కూర్చున్న నేను ఇద్దరమూ వాడి మాటలకు తెల్లబోయాము.

"ఫోరా, వెధవా. మింగ మెతుకు లేనివాడికి పౌరుషం కూడాను." ఆయన తాటిప్రమాణాన లేచాడు.

"తిట్టటం గొప్పకాదు సార్! మనసున్న వాళ్లెప్పుడూ మాటలతో నొప్పించరు. మీరు గొప్పవారుకూడాను. మీ కిష్టంలేకపోతే వద్దు. అనవసరంగా తిట్టకండి. సెలవు" అని ఓసారి నమస్కారంచేసి వెళ్ళిపోసాగాడు ఆ కుర్రవాడు.

ఆ పెద్దమనిషి ముఖాన కత్తివాటుకి నెత్తురు చుక్క లేదు. అంత ఆశ్చర్యంలోనూ నాకు నవ్వు వచ్చింది. ఆ కుర్రవాడి వ్యక్తిత్వానికి అద్భుతాశ్చర్యాలలో మునిగి పోయాను! ఆ పెద్దమనిషిమీద నా అసహ్యాన్ని వ్యక్తంచేయటంకోసం వాణ్ణి కేకవేసి పిలిచాను.

గంట క్రితమే పాలిష్ చేయించుకున్న షూకి మళ్ళీ పాలిష్ చేయమన్నాను వాణ్ణి. నా మనసు గ్రహించి వాడు కృతజ్ఞతతో తల పంకించాడు. ఆ చిన్నచేతుల పనితనాన్ని పరికిస్తూ కబుర్లలోకి దింపాను.

"నీ పేరు?"

"గోపన్నండి. అక్క, అమ్మ గోపీ అని పిలుస్తారు."

"ఏమన్నా చదువుకున్నావా?"

"థర్డ్‌ఫారం చదువుతున్నానండి."

నిర్ఘాంతపోయాను. "మరి ఈ పని ఎందుకు?"

"కుటుంబపోషణకోసం, బాబూ! నాన్న లేడు. అమ్మ గుడ్డిది. అలాగే ఏవో ఆకులూ అవీ కుడుతుంది. అక్క పూలమ్ముతుంది. చెల్లి, నేను చదువుకుంటున్నాము. ఒక్క అక్క సంపాదనమీద ఇల్లు ఎలా గడుస్తుంది? అందుకని తీరికసమయాల్లో ఈ పని నాకు తప్పనిసరి, బాబూ!"

వాడి విషాదగాథ విన్న నా మనస్సు ద్రవించి పోయింది. ముక్కుపచ్చలారని ఆ వయస్సులో కుటుంబపోషణకోసం పాటుపడుతూ, మరోమూల విద్య నభ్యసిస్తూ ఏమాత్రంకూడా ఆత్మాభిమానం కొరవడని ఆ పసివాడు నా అంతర్యంలో ఉన్నత గిరుల నందుకున్నాడు. ఇటువంటి ఆత్మాభిమానినా ముష్టివాడని ఆ పెద్దమనిషి చీదరించుకున్నది! పైకి డాబుగా ఉండే ఇటువంటివారి హృదయాల్లో ఎంత కల్మషమైనా పేరుకొని ఉంటుంది.

మాణిక్యం బొగ్గులలో కప్పబడినా తన సహజ తేజఃపుంజాన్ని వెదజల్లుతూనే ఉంటుందని వాళ్ళకి తెలియదు!

గోపీ తన పని పూర్తిచేసుకొని లేచాడు. నేను రూపాయినోటు ఇవ్వబోయాను.

"నా దగ్గిర చిల్లర లేదు, సార్!"

"వద్దు. అంతా నువ్వే తీసుకో!"

"పాలిష్ రేటు ఇరవై పైసలుమాత్రమే సార్! చేసిన పనికంటె ఎక్కువ తీసుకుంటే అది అక్కరకు రాదు, బాబూ! పైగా అక్కకు తెలుస్తే నన్ను కోప్పడుతుంది."

ఇంకేమనను? ఇంత నిజాయితీ కల అమృతహృదయుడి కీ దరిద్రజీవిత మిచ్చావేమిటి భగవాన్! ఒక్కసారి గోపీని దగ్గిరికి తీసుకొని బుజ్జగించాలనిపించింది. కాని, నా అంతస్తు? ఛీ! ఆ మాట ఆ వేళ అనుకున్నందు కిప్పుడు సిగ్గుపడుతున్నాను.

"పోనీ అప్పుగా తీసుకో, గోపీ! ప్రతిరోజూ ఇదే వేళకు నువ్వు ఇక్కడకు వచ్చి పాలిష్ చెయ్యి. సరేనా!"

నా సమయస్ఫూర్తికి నన్ను నేనే మెచ్చుకున్నాను.

వా డిక మాట్లాడలేకపోయాడు. "మీ రెంత మంచివారు, బాబూ! మీకు దైవం మేలు చేస్తాడు" అంటూ రూపాయినోటు తీసుకొని నాకు నమస్కరించి వెళ్ళిపోయాడు.

> **నేడు రేపు**
>
> నేటికోసమే నీవు బ్రతికితే రేపటిని నీవు ధ్వంసం చేసివేసుకుంటున్నావన్న మాట. —సిమ్మన్స్

ఆ తరవాత రోజూ దాదాపు నేను పార్కుకి వెళ్ళటం, వాడు నా షూకి పాలిష్ చేయటం నిత్యకృత్యమైపోయింది. తరుచు వాడి కుటుంబ క్షేమ సమాచారాలు అడిగి సానుభూతిచూపటం వాడిని నాకు మరింత సన్నిహితుణ్ణి చేసింది.

"బాబూ!" గోపీ పిలుపుతో ఆలోచనల్లోంచి తేరుకున్నాను. వాడి ముఖం కళావిహీనమై ఉంది. యాంత్రికంగా నా కాలు చాపటం, వాడు షూ విప్పి పాలిష్ చేయటం జరుగుతూంది.

"అలా ఉన్నావేం, గోపీ!"

వాడు మాట్లాడలేదు. తల దించుకున్నాడు.

"మాట్లాడవేం గోపీ! ఇంట్లో అంతా కులాసాయేనా?" అని ఆత్రంగా అడిగాను.

"మంచిగా బతికేవాళ్ళు కివి రోజులు కావు, బాబూ! అక్క పూలవ్యాపారం మానేసింది!"

"ఏం? ఏమయింది?" వాడి కుటుంబాన్ని ఆదుకోమని నా అంతర్వాణి నన్ను హెచ్చరించింది.

"అక్కమీద కిట్టనివాళ్ళు బ్రోకరుతో చాడీలు చెప్పారు. వాడొక రౌడీ. తన మాట వినకపోతే పూలవ్యాపారం పడగొట్టేస్తానని బెదరించాడు. మీద చెయ్యి వెయ్యబోతే అక్క వాడి చెంప ఛెళ్ళుమనిపించింది. అంతే! మా కూట్లో దుమ్ముపడింది." గోపీ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

"మరిప్పు డేం చేస్తోంది?"

"ఏడుస్తూ ఇంటివద్దనే ఉంది. నేనుకూడా అక్కడే కూర్చుంటే ఎలా? రెక్కాడితేకాని డొక్కాడదు కదా! నే నిలా వచ్చాను. ఇకముందు రోజులు ఎలా వెడతాయో తెలియదు." వాడు నిరాశగా తనకు తాను చెప్పుకుంటున్నట్లు అన్నాడు.

"మీ ఇంటికి వస్తాను, పద" అన్నాను. గోపీ తెల్లబోయాడు.

"మా ఇంటికా? ఎందుకు, బాబూ? మురికివాడ అసహ్యంగా ఉంటుంది" అన్నాడు.

"మురికివాడ ఎలా ఉంటే నాకేం? అందులోని మాణిక్యాలను చూడటానికి వస్తున్నాను, గోపీ!" అని నవ్వాను. గోపీ మరింతగా ఆశ్చర్యపోయాడు.

"మా అక్కపేరు మీ కెలా తెలుసు, సార్!" అని అడిగాడు అమాయికంగా.

"మీ అక్కపేరు మాణిక్యమా!" కాకతాళీయకంగా అన్న మాట నిజమవటం నా కాశ్చర్యం కలిగించింది.

"అవునండి."



"ఒడలెల్ల కనులు"
— జి. వి. సత్యనారాయణరావు (హైదరాబాద్)

"ఆలస్యం చెయ్యక పద."

ఇద్దరం సిటీబస్సెక్కి మురికివాడదగ్గర స్టాప్‌లో దిగాము. పిస్నగా ముందు గోపి, అతనివెనక ఉత్సాహంతో నేను నడుస్తున్నాము. ఓ పేద కుటుంబాన్ని ఆదుకుంటున్నాననే సంతోషంలో నా బాధలన్నీ మరుగున పడిపోయాయి. చుట్టూ చీకటిమూలాన ఎవరూ నన్ను గుర్తుపట్టలేదు.

ఓ పూరిగుడిసెలోకి దారి తీశాడు గోపీ. చుట్టుపక్కల గుడిసెలకన్న అదే తీరుగా, నీటుగా ఉంది. "అక్కా, బాబుగారని చెప్పానే ఆయన నిన్ను చూడటానికి వచ్చారు" అని ఓ కేక వేశాడు గోపీ. అప్పుడే ముఖం కడుక్కుని లోపలికి వచ్చిన ఆ యువతిని చూసి నేను, నన్ను చూసి ఆమె తెల్లబోయాము.

ఆమె మల్లెపూల మాణిక్యం! వారిజ, శాంత నా హృదయాన్ని ఏలుకున్న రోజుల్లో నా ఒడిని మల్లెపూలతో నింపిన మాణిక్యం! తను నాకు పూలు అమ్మినంతకాలం స్వార్థపూరితలైన స్త్రీల నర్చించటానికే వాటి నుపయోగించాను. త్యాగమూర్తి అయిన స్త్రీ పూజ అందుకునేనాటికి పూలు అమ్మినచోటనే కట్టెలమ్మ వలసిన దుస్థితి వచ్చింది. అది నేను భరించలేకపోయాను. ఓ విలాసపురుషుడుగా ఆమె దృష్టిలో కనపడిన నాకు నా అసలు రూపాన్ని బయటపెట్టుకోవాలన్న పిచ్చికోరిక కలిగింది.

ఆ కుటుంబాన్ని ఆదుకోవాలన్న ఆవేశంలో ఆమెను మా ఇంట్లో పనికి రమ్మన్నాను. దానికి వాళ్లెంతో పరమానందభరితులయ్యారు.

అదే సమయంలో మా ఇంట్లో పనిమనిషి కావలిసివచ్చింది. ఆమెను కుదర్చటానికి ఏ ఆటంకము రాలేదు. కాంపౌండులోనే మూలగా ఒక పాక ఉంది. అందులో ఆ చిన్నకాపరం చేరింది. నెలజీతం ఏర్పాటు చేశాను. గోపీ తిరిగి పాలిష్ పని చెయ్య నవసరం లేకుండానే వాళ్ళకు జీవనోపాధి ఏర్పడింది.

ఆ సమయంలో ఓ కుటుంబాన్ని ఆదుకున్నాననే తృప్తితప్ప మరే దృష్టి లేదు నాకు.

కాని, రానురాను ఇల్లంతా కలయతిరుగుతూ మనిషి మనిషికీ ఏం కావాలో అడిగి అన్నీ అమర్చే మాణిక్యం తరుచు నా దృష్టి నాకర్షించసాగింది. అంతస్తు గొంతు నొక్కినా మనసులో ఆమె చేరువను మాటి మాటికి కోరుకుంటున్నాను. దానికితోడు మనసుకి శాంతి, కడుపుకి తగినంత తిండి లభించటంతో ఆమె శరీరలావణ్యం మెరుగులు దిద్దుకొని సౌందర్య కాంతుల్ని వెదజల్లి నన్ను ఆకట్టుకుంది.

తనగురించి జాగ్రత్త తీసుకునే వ్యక్తి, తనంటే సంతపించే వ్యక్తి ఒకరు లభించారని తెలిసినప్పుడు ఆ హృదయంలో ఆ వ్యక్తి శాశ్వతంగా చోటు చేసుకోవటం సహజం!

ఉదయం బెడ్‌కాఫీ ఇవ్వడం మొదలుకొని రాత్రి పాలగ్లాసు చేతి కందించేవరకు ఆమె చెయ్యనిదే, ఆమె చెప్పనిదే ఏమీ చేసుకోలేని స్థితికి వచ్చాను.

"మాణిక్యం, నిన్నిలా పిలిస్తే బాగోలేదు. మణీ అని పిలుస్తాను. సరేనా!" అన్నాను ఓసారి.

మెత్తగా నవ్వి, "మీ రెలా పిలిచినా పలుకుతాను, చినబాబూ!" అన్నది.

ఆమె కళ్ళు ఎప్పుడూ అందంగా మెరుస్తుంటాయి. మనోనైర్మల్యాన్ని ప్రస్ఫుటం చేస్తూ ఆమె పెదవులపై ఎప్పుడూ చిరునవ్వు నర్తిస్తూ ఉంటుంది.

మల్లెపూలకు, మాణిక్యానికి ఏదో అవినాభావ సంబంధంఉంది. అంతక్రితం ఎవరూ జాగ్రత్త తీసుకోక పోవటంతో తోటలో ఎండిపోయిన మల్లెఅంటు మాణిక్యం రాకతో పునరుజ్జీవితమై వైశాఖం వచ్చేసరికి వెర్రిగా పూయ నారంభించింది.

పాపం, పూలంటే మా వదినకు ఎలర్జీ కాబోలు! ఇక పూలు పెట్టుకునేవాళ్ళు ఎవరున్నా రింట్లో? మొదట్లో సందేహించినా, తరవాత నేను ఒత్తిడి చెయ్యటంతో తనే చిన్న దండ పెట్టుకొని తక్కిన పూలన్నీ దండలు గుచ్చి దేవుళ్ళ ఫొటోలకు పెట్టేది మాణిక్యం.

ఒకనాడు కొత్తచీర గోచీపోసి కట్టుకుని, జుట్టు ముడి గట్టిగా చుట్టుకొని, బిగుతైన జాకెట్టుతో తన యౌవనశోభతో కన్నులపండుగ జేస్తూ కనిపించింది ఆమె. అకస్మాత్తుగా నండూరివారి ఎంకి నా కన్నులలో మెదిలింది. "నండూరివారి ఎంకిలా ఉన్నావు, మణీ!" అన్నాను.

"ఆవి డెవరు, చినబాబూ!" అన్నది కళ్ళు ఎం పెద్దవి చేసుకొని చూస్తూ.

కడుపుబ్బ నవ్వు వచ్చింది. మాణిక్యాన్ని ఆట పట్టించా లనిపించింది. "ముద్దుగాని ఇటు రా!" అని నా గదిలోకి తీసుకుపోయి నా స్నేహితుడు రామారావు వేసిన వర్ణచిత్రాన్ని చూపెను. గలగలా నవ్వింది మాణిక్యం. "ఇంకా ఎవరో అనుకుని హడిలిపోయాను, చినబాబూ!" అంది తేలిగ్గా నిట్టూరుస్తూ.

"ఏం? ఎవరేనా అయితే ఏం చేస్తావు?"

"ఊహుం, చెప్పను" అని నవ్వి పారిపోయింది.

నందివర్ధనంచెట్టుచాటున నిలబడి తన తలలో పూలు ముడుచుకుంటూ కూనిరాగం తీస్తూ పరాగ్గా ఉన్నది ఆమె. ఆమె ప్రతిరూపం నా కెమేరాలో ఎప్పుడు బంధించబడిందో ఆమెకు తెలియదు. రెండోరోజున ఫొటో తీసుకువచ్చి చూపేసరికి తెల్లబోయింది. ఎరుపెక్కిన ఆమె బుగ్గల్ని ముద్దు పెట్టుకునే అవకాశం నాకు రాలేదు!

"ఎవరేనా చూస్తే ఏమనుకుంటారు, చినబాబూ!" అన్నది ఎంతో కంగారు పడిపోతూ.

"ఇంతకీ నీ వేమనుకుంటున్నావో చెబుదూ."

"అబ్బ, కొంటెవాడవయిపోతున్నావు నువ్వు. నీతో మాటాడకూడదు" అంటూ పరుగున వెళ్ళిపోయింది.

మరునాడు నా ఫొటోమీద మల్లెపూల దండ మాణిక్యం హృదయాన్ని తెలియజెప్పింది!

ఇదంతా ఆమె బాహ్యసౌందర్యం కలిగించే వ్యామోహమేమోనని అనిపించిన ఘడియలు లేకపోలేదు. కానీ, ఆమె హృదయసౌందర్యం తిలకించే సదవకాశం నాకు వెంటనే లభించింది.

అకస్మాత్తుగా నాకు టైఫాయిడ్ తగిలింది. ఇరవై ఒక్క రోజులు అహర్నిశలు నన్ను అంటిపెట్టుకొని సేవచేసిందా అమృతమూర్తి. రక్తసంబంధీయులే మొక్కుబడిగా రోజుకోసారి పలకరించిపోతున్న తరుణంలో తల్లిప్రేమంటే ఏమిటో ఎరగని నాకు తల్లి ప్రేమ, బంధుప్రేమ ఇంకిపోయిన హృదయంలో రాగసుధ పొంగించి పారించిందా త్యాగమూర్తి! బీడువారిన నా హృదయంలో కొత్తఆశలు పేరుకున్నాయి... జీవితంమీద మమకారాన్ని, భవిష్యత్తుమీద నమ్మకాన్ని కలిగించాయి.

మణి నా హృదయాన్నంతా ఆక్రమించుకుంది. ఆమె తోడిదే నాకు లోకమైపోయింది.. ఆమె క్షణం కనుమరుగయితే మనస్సు విలవిలలాడిపోతుంది. ఆమె చేతో్తకాని అన్నం తిన్నట్లుండదు. ఆమె మంచి నీళ్ళిస్తేకాని నాకు దాహం తీరదు. అవును, మాణిక్యం నా హృదయవీణ మీటింది. నా గుండెల్లో గంటలు మ్రోయించింది. నా మనస్సును నిత్యవసంతంతో నింపింది. ఆమె నాలోని స్పందన . . . ప్రాణప్రియ అయిపోయింది!

ఈ అనుబంధాన్ని శంకిస్తున్న పిడుగులు చెవులు కొరుక్కోవటం నేను విన్నాను. మాణిక్యాన్ని చాటుగా [illegible]

ఈ విషయమేమో నా దగ్గిర ప్రస్తావించలేదు. నా మనస్సుకి ప్రశాంతత కలిగించాలని ఆమె అహర్నిశలు పడిన శ్రమ ఫలించింది. నేను సంపూర్ణారోగ్యవంతుడ నయ్యాను.

నా మనస్సులోని కోరికలకో రూపం ఏర్పడింది. మణితోటి అనుబంధం శాశ్వతం కావాలి. ఈ జీవితంలో ఇంకే అసంతృప్తి లేకుండా భవిష్యత్తు మధురమయం కావాలి. అంటే ఆమె నాకు సహచరి కాకతప్పదు. ఈ నిర్ణయానికి రావటానికి నా కాట్టే కాలం పట్టలేదు.

శాంత, వారిజ మనస్సులో మెదిలినకొలదీ డబ్బున్న వాళ్ళంటే నాలో అసహ్యం ఏర్పడిపోయింది. 'పేద ఇంటి పిల్లనే, నన్నభిమానించేదాన్నే నేను చేసుకోవాలి. దీనికి మణికంటే యోగ్యురాలు నాకీ జీవితంలో దొరకబోదు!' అని నిర్ణయించుకున్నాను.

నా కోరిక బయటపెడితే మాణిక్యం ఫక్కున నవ్వింది!

● ● ● ●

తలుపు చప్పుడవటంతో నా ఊహాలోకం వదిలి బయటపడ్డాను.

ఫ్లాస్కు, కాఫీ తీసుకొని లోపలికి వచ్చింది మాణిక్యం. కాఫీలో ముంచి ఒక్కొక్కటే నాచేత తినిపించింది.

తనలో తాను ఏదో మాట్లాడుకుంటూంది ఆమె. నా ఆత్రత అణచుకోలేక, "ఏమిటే అనుకుంటున్నావు మణీ!" అని అడిగాను.

"ఏమీలేదు బాబూ!"

"కాదు. ఏదో ఉంది. చెప్పవూ?"

నా జుట్టులోకి తన వేళ్ళు పోనిచ్చి నిమురుతూ అంది: "ఇంత వయసొచ్చినా నువ్వింకా పసివాడవే చినబాబూ! ఒకవేళ ఏ కారణం చేతయినా ఇక్కడినుంచి వెళ్ళిపోతే నిన్ను ఎవరు కనిపెట్టుకొని ఉంటారు? అదే నా బాధ! . . ."

నా గుండెలు దడదడలాడాయి. "నువ్వెక్కడికి వెడతావు? నిన్ను వెళ్ళనివ్వనుగా!" బింకంగా అన్నాను.

ఆమె పేలవంగా నవ్వింది. "నీ కిష్టమయితే సరిపోతుందా? మన చనువు బయటపడితే. . ."

". . . నిన్ను నేను పెళ్ళిచేసుకోబోతున్నానుగా మణీ!"

ఆమె ముఖం గేదగిలా శోభించింది. "నా కంత అదృష్టమా బాబూ! ఎందుకీ ఆశలు నాకు?"

గబుక్కున పైకిలేచి ఆమె చేతిని నా గుండెలకి చేర్చుకొని, "నన్ను నమ్మలేవా మణీ! నన్నెవ్వరడ్డు పెట్టగలరు?" అన్నాను ఆవేశంగా.

"నేనే!"

తెల్లబోయాను. "నువ్వా? ఏం, నే నంటే నీ కిష్టంలేదా?"

"ఇష్టం ఉంది కనకనే వద్దంటున్నాను చినబాబూ!"

"నువ్వనేది నా కర్థం కావటంలేదు మణీ!" అయోమయంగా చూశాను ఆమెవైపు.

"ఇంత అమాయకుడివి కనుకనే నీకు జీవితం అంటే అర్థం కావటంలేదు. నీ మంచి మనసుకి పేద, గొప్ప తెలియకపోయినా నా విలువ నాకు తెలుసు. 'కనకపు సింహాసనమున శునకము' అన్న పద్యం చదువుకోలేదా చినబాబూ!" అని పేలవంగా నవ్వింది ఆమె.

నాకు చిర్రెత్తుకు వచ్చింది. "పిచ్చిమాటలు చెప్పకు. నీ కున్న సంస్కారం ఎంత ఉన్నతమైనదో నాకు తెలుసు. అంతస్తులో పేదదానివయినా గుణంలో ఈ ఇంట్లో ఎవరికీ తీసిపోవు నువ్వు. నీ విలువ నీ కేం తెలుసు? నా హృదయానికి తెలుసు. ఇంకే వంకలు చెప్పకు నాకు."

"అదికాదు చినబాబూ! నువ్వా గొప్పగా చదువుకున్న వాడివి. నేనా ఐదో తరగతి చదివిన పల్లెటూరి బైతును. రేపు నీ పక్కన తగుదునమ్మా అని నేను నిలబడితే నలుగురి పెద్దవాళ్ళ ఎదట నీ కెంత అవమానం? అప్పుడు చిన్నపోయిన నీ ముఖంచూసి నే నేమైపోవాలి? పెళ్ళి నువ్వనుకున్నంత సులువు కాదు. . ." ఆమె వాదనలోని తీరు నన్ను ముగ్ధుణ్ణి చేసినా నా మనస్సు రాజీకి రాలేదు.

"ఎందుకు కాదు? నీకు చదువు చెబుతాను. కాలేజీచదువులు చదివామని గొప్పలు చెప్పుకునే వాళ్ళెందరికంటేనో నీవు తెలివైనదానివి. ఒక్క రెండేళ్ళలో నిన్ను విద్యావతిని చెయ్యగలను. నిన్ను పొందిన అదృష్టంముందు ఈ కష్టమేపాటి?"

ఆమె తల అడ్డంగా తిప్పింది. "వీటన్నిటికంటే ముఖ్యమైనవెన్నో ఉన్నాయి చినబాబూ! పేదపిల్లని కట్టుకున్న ధనవంతుడు జీవితాంతం సుఖంగా ఉన్నా డంటే అది ఏ సినిమాల్లోనో, కథల్లోనో నిజమవుతుంది. కాని, జీవితంలో అది నిజంకాదు. మనచుట్టూ కొన్ని ముళ్ళకంచెల హద్దులున్నాయి. అవి దాటిపోగలిగే శక్తి మనకు లేదు. మొండిగా దాటితే ముళ్ళు గుచ్చుకుంటాయి. నీ ప్రేమ నేను అనుమానించటం లేదు చినబాబూ! కాని, ముందు ముందు నీ బంగారు జీవితంలో ఏ కలతలు కలిగినా ఈ ప్రేమంతా మోహ మాత్రమేననిపిస్తుంది. అప్పుడు నువ్వే నన్ను అసహ్యించుకుంటావు..."

"మణీ! ఎందుకిలా నన్ను చిత్రవధ చేస్తున్నావు?" అన్నాను బాధగా.

"నీకు తెలియదు చినబాబూ! జీవితంలో ప్రేమ, పెళ్ళి ఈ రెండు మాత్రమేకాదు ఉన్నది. అది మంచి ఫలితాన్ని ఇవ్వాలంటే ఇంకా చూడవలసినవి చాలా ఉన్నాయి. అంతస్తు, అయినవాళ్ళు అడ్డు వస్తారు. ఈ పేదపిల్లతో మనువు పెదబాబుగారి కెప్పుడూ ఇష్టముండదు. అంతస్తులో వారికి సరితూగని నన్ను, కొన్ని నెలలు తమ ఇంట్లో దాసీపని చేసిన నన్ను కోడలుగా ఆయన అంగీకరించలేరు. మీరు బలవంతపెడితే అది మీ కుటుంబ కలహానికి దారి తీస్తుంది. దానివల్ల మీరు మీ వాళ్ళకి దూరమౌతారు."

"అందుకు నేను సిద్ధంగా ఉన్నాను. నావాళ్ళు నన్నెప్పుడూ లెక్కచెయ్యనేలేదు. డబ్బు సంపాదన తప్ప తక్కినవేవీ గుర్తురానివాళ్ళకి ఇంక ఆత్మీయులు ఎలా కనబడతారు? నాకు వీటన్నిటికంటే మించిన దానివి నువ్వు. నీవుంటే నా కింకేమీ అక్కర్లేదు. . ."

"ఇప్పుడావేశంలో అట్లాగే అనిపిస్తుంది. ఓ అనామకురాల్ని కట్టుకున్నందుకు మీ మంచిమనసు నర్థం చేసుకోని బంధువులు, స్నేహితులు మీకు కలిసిరారు. నీవు ఒంటరివయిపోతావు. ఆస్తిలో మీ నాన్నగారు వాటా ఇవ్వకపోవచ్చు. నా దరిద్రం నిన్ను చుట్టుకుంటుంది. నీవనుకున్నంతగా మన సంఘం మారలేదు. ఇప్పుడావేశంలో మనం చేసేపని ముందు ముందు ఎన్ని కష్టాలనయినా కలిగిస్తుంది. సిగ్గు విడిచి చెబుతున్నాను. మనకు పుట్టే పిల్లల్ని సహృదయతతోచూసేమంచిమనసులు ఎవరికుంటాయి? అంతస్తును దాటి నిన్ను నేనందుకోవాలంటే దీపం మీదికి మిడత దూకినట్లే అవుతుంది. జరుగుబాటు ఉన్నవాళ్ళకే ఇటువంటి వన్నీను. దరిద్రం తాండవిస్తూంటే ఎటువంటి ప్రేమలయినాసరే విషమయిపోతాయి బాబూ! ఈనాడు నీవిస్తున్న విలువను ఇలా మనస్సులో దాచుకొని తృప్తిపడితే మంచిది కాని, నేనుకూడా తొందరపడితే ఇంక మన జీవితాల్లో చివరివరకూ చీకటే మిగులుతుంది చినబాబూ!"

ఆమె ఎంత చెప్పినా నేను సమాధానపడలేక పోతున్నాను. ఆమెను వదులుకోవాలంటే ప్రాణసంకటంగా ఉంది.



రథద్వయం (ఉడిపి)
—డాక్టర్ షేక్ హుసేన్ (విజయవాడ)

"అదేంకాదు. భవిష్యత్తు ఎంతో భయంకరమని నీవు భయపెట్టినా నా మనస్సుమీద నాకు నమ్మకం ఉంది మణీ! నాకు డబ్బుకాదు ప్రధానం ప్రేమ, ఆత్మీయత నాకు కావాలి. అవి లభించాలంటే నువ్వు నాకు కావాలి. నేను చదివిన చదువుకి మంచి ఉద్యోగమే వస్తుంది. ప్రపంచమంతా వెలివేసినానేను నీసాహచర్యంలో మధురజీవితాన్ని గడపగలను. నీ విలువ ఎప్పటికీ తరగనిది. నా హృదయంలో నీ స్థానం ఏ నాటికీ మాయనిది. మన ప్రేమ శాశ్వతమయినది మణీ! మోడువారిన నా జీవితంలో వసంతాన్ని చిలికించిన దేవతవి. నీ రాగసుధను పారించి నా హృదయక్షేత్రాన్ని సస్యశ్యామలం చేశావు. దానికి ప్రతిఫలంగా నా జీవితాన్ని తప్ప నే నింకేది నీ కర్పించగలను?" అంటూ ఆమె చుట్టూ చేతులువేసి గట్టిగా హృదయానికి హత్తుకున్నాను.

ఆమె అడ్డు పెట్టలేదు. మృదువుగా నా చెక్కిలిపై, ఫాలభాగంపై ముద్దు పెట్టుకుంది. ఆ మధుర

క్షణాలు నా జీవితంలో మరుపురానివి!

మృదువుగా నా కౌగిలి విడిపించుకొని లేచినిలబడింది మాణిక్యం. నాకేసి అలా క్షణంపాటు దీర్ఘంగా చూసి నిట్టూర్చింది.

"నువ్వు పడుకో చినబాబూ! నాకు ఇంట్లో పని ఉంది. మళ్ళీ వస్తానుగా...." అని మెత్తగా నవ్వింది. కాని, ఆ నవ్వులో వెనకటి కాంతిలేదు.

ఏదో భయం నన్ను చుట్టింది. "మణీ!. . . నన్ను వదిలిపెట్టి పోవుకదూ!"

"ఎప్పుడూ నీ మనసులో ఉండే మణీ ఎక్కడికి పోగలదు చినబాబూ!"

హాయిగా నిట్టూర్చి పక్కమీద వాలాను. మణితోటి నా భావిజీవితాన్ని ఊహించుకుంటూ గడిపాను. ఆ ఆలోచనల్లోనే చిన్నగా కునుకు పట్టింది.

అట్లా ఎంతసేపు పడుకున్నానో నాకు తెలియదు. మెత్తని కరస్పర్శతో మెలకువ వచ్చింది. నా నుదుటి మీది చెమటను తన చీరచెంగుతో తుడుస్తోంది మాణిక్యం!

"అన్నం తిని మళ్ళీ పడుకుందువుగాని లే చిన బాబూ!

పైకి లేస్తూ బయటకు చూశాను. కటిక చీకటి. అంటే చాలసేపు పడుకున్నానన్నమాట. చేతికి తగిలిన గాయం నొప్పి చేసింది. అంతవరకు ఈ విషయం ఎవరికీ తెలియదు.

"నాన్నగారు రాలేదా?"

"లేదు. హైదరాబాదు వెళ్ళారుట. ఇప్పుడే భోజనంచేసి పెదబాబు, అమ్మగారు పడుకున్నారు. మీగురించి అడిగితే నిద్రపోతున్నాడని చెప్పాను.

తన చేత్తో నాచేత అన్నం తినిపించింది ఆమె.

"గోపీ ఏడి? ఈవేళ కనిపించలేదేం?" అని అడిగాను.

"పరీక్షలయిపోయాయి కదూ! స్నేహితుడితో సినిమాకి వెళ్ళాడు. ఈపాటికి వచ్చిఉంటాడు. . . ఇక పడుకో చినబాబూ!"

"ఎలా?" నవ్వాను నేను.

"ఇలా గుండెలమీద చేతులు పెట్టుకొని నిశ్చింతగా తీయని కలలు కంటూ ..." అంది ఆమె మధుర మందహాసంతో.

"నువ్వు లేనిదే ఆ కల ఎలా తియ్యగా ఉంటుంది మణీ!"

నా జుట్టు నిమురుతూ అలా కాసేపు మౌనంగా ఉండిపోయింది మాణిక్యం. నా ఒళ్ళు పులకించిపోయింది. మౌనంగా మధువును ఆస్వాదించే శక్తి నాకు మాణిక్యమే ప్రసాదించింది!

గాఢసుషుప్తిలో కూరిగిపోయిన నాకు ఎప్పుడు ఆమె వెళ్ళిపోయిందో తెలియదు.

తెల్లగా తెల్లవారింది. ఆపాటికి బెడ్‌కాఫీ తీసుకువచ్చే మణి జాడలేదు. ఆమె వచ్చేవరకు లేవకూడదని బింకంగా అలానే పడుకున్నాను. చేతినొప్పి కొంచెం తగ్గింది.

అరగంట భారంగా గడిచింది. సహనం కోల్పోయాను. నేను లేవకముందే నా ఫోటోకి పూలదండ వేయడం ఆమెకలవాటు! పైకి లేచి బల్లవైపు చూసి తెల్లబోయాను. ఆ ఫోటో అక్కడ లేదు!

ఒక్క ఉదుటున బల్లదగ్గిరికి చేరుకున్నాను. బల్లమీద పేపర్‌వెయిట్‌కింద రెపరెపలాడుతూ ఓ కాగితం మడత. దానిమీద "చినబాబుకి" అని ముత్యాలకోవలో అక్షరాలు. గుండె గుభేల్ మంది. ఆత్రంగా వణికే వేళ్ళతో అది విప్పి చదివాను.

"చినబాబుకి,

నమస్కారములు.

ఇలా చెప్పా పెట్టకుండ వెళ్ళిపోవలసి వస్తుందని కలలోకూడా అనుకోలేదు. కాని, నీ మేలుకోరి ఇలా వెళ్ళిపోక తప్పలేదు.

నీ మంచిమనసులో చోటు చేసుకున్న ఈ మాణిక్యం ఎప్పుడూ అదృష్టవంతురాలే చినబాబూ. అందుకు నీ బాగు కోరాలి కాని నీకు కీడు చేయకూడదు.

ఇదే నేను నిన్న నీతో అంటే నా మాట విన్నావు కాదు. నన్ను నీవు వదులుకోలేవు. నిన్ను నేను వదులుకో లేను. కాని, నీ జీవితాంతం ఆనందంగా గడవాలంటే నా కోరికను నేను చంపుకోక తప్పదు. నీవయితే అన్నీ తెగతెంపులు చేసుకోటానికి సిద్ధమయివావు. కాని, నా కున్న బాధ్యతలు కదలరానివి, వదలలేనివి. కళ్ళు లేని తల్లి, పసివాళ్ళు తమ్ముడు, చెల్లెలు వీళ్ళకి నేను కాక వేరే దిక్కెవరు చినబాబూ! రక్తసంబంధం పేదరికంలో మరింత తెంచుకోలేనిది అవుతుంది!

ఇదే నీతో నేనంటే నా బాధ్యతల్నికూడ నీమీద వేసుకోటానికి సిద్ధమవుతావు! అప్పుడిక నీకు సుఖమెక్కడుంటుంది? నీ ముందు జీవితం ప్రశాంతంగా గడిచిపోవాలంటే, నావాళ్ళు అనాథలు కాకుండా ఉండాలంటే నే నిలా నిన్ను విడిచిపోవటం తప్ప మార్గం కనిపించలేదు.

మనస్సు గట్టిపరుచుకో చినబాబూ! నీ పసితనమే నాకు బాధ కలిగిస్తుంది. నా చేత్తో తినిపించందే తృప్తిపడని నీ విక నీ చేత్తో తినటం నేర్చుకోవాలి. చిన్న చెంపదెబ్బ కొట్టినందుకే గిలగిలలాడి చేతికి గాయం చేసుకున్న నీవు నే నిలా పోయానని తెలిసి ఏం చేస్తావోనని భయంగా ఉంది.

నే నెక్కడికీ పోవటంలేదు చినబాబూ! ఎప్పుడూ నీ మణి నీ మనస్సులోనే ఉంటుంది. నీ క్షేమం కోసం ఎప్పుడూ పరితపిస్తూనే ఉంటుంది. గుండె దిటవుచేసుకో. నన్ను అర్థం చేసుకో. కలతలు రాకుండా నిశ్శబ్దంగా వెళ్ళిపోయిన మాణిక్యం మాటలు గుర్తు తెచ్చుకో. జీవితమంటే నీ కర్థమవుతుంది. చదువుకొన్న దాన్ని ఇంతకంటే నీకేమి చెప్పగలను?

నిత్యం నా కన్నులపండుగ చెయ్యాలని నీ ఫోటో తీసుకువెడుతున్నాను. చెప్పివెళ్ళనందుకు నన్ను క్షమిస్తావు కదూ!

ఎల్లప్పుడూ నీ క్షేమంకోరే
నీ మాణిక్యం.'

• • •

". . . . నా మణి వెళ్ళిపోయింది. నా జీవితంలో వెన్నెలరాత్రుళ్ళు వెళ్ళిపోయాయి. నా మనస్సులో చీకటి! నా చుట్టూ చీకటి! ఈ సుదీర్ఘమైన కాళరాత్రిలో దారితెలియని బాటసారిని నేను." అంతవరకు చెప్పి గాఢంగా నిట్టూర్చాడు రాజశేఖరం.

"మీ హృదయంలో ఇంత అగ్ని రగులుతూందని అనుకోలేదు. . . " అన్నది శారద.

"మీరయినా నన్నర్థం చేసుకున్నందుకు కృతజ్ఞుణ్ణి. నా భవిష్యత్తు నాకే అగమ్యంగా ఉన్నప్పుడు, మనస్సులో మరో స్త్రీని ఆరాధించే నాతో మీకు పొత్తు ఎలా కుదురుతుంది? నా జీవితం వాసనలేని గడ్డిపువ్వువంటిది. శారదాదేవీ! మీ జీవితం దుఃఖమయం చేసుకోకండి!" అన్నాడురాజశేఖరంఎటోచూస్తూ. అతనికనుకొలుకుల్లో రెండు ముత్యాలు మెరవటం శారద కనిపెట్టక పోలేదు.

ఆమె హృదయం కరుణతరంగిణి అయింది. అతన్ని తన గుండెల్లో పొదివి పట్టుకొని బుజ్జగించాలనిపించింది, అంతలోనే నవ్వుకుంది. పాతికేళ్ళ పసివాడు రాజశేఖరం!

మాణిక్యం మాటలు గుర్తుకు వచ్చాయి శారదకి. "మా బాబు బొత్తిగా పసివాడమ్మా! నామీద వెర్రిప్రేమతప్ప జీవితమంటే బొత్తిగా తెలియదు. శారదమ్మతల్లీ! ఎలా మనసుమార్చి నీవాడిని చేసుకుంటావో! చదువుకున్నదానివి. తెలివైనదానివి. నీ మంచిమనస్సు తెలిశాక నా బాబుకి తగిన పిల్లవి నీవేనని నా కనిపించింది. ఇన్నాళ్ళకి నా కష్టం ఫలించింది. ఓపికగా వెదకినందుకు ఫలితం దక్కింది. నేను పంపాననిమాత్రం చెప్పకుతల్లీ! నన్నుమరిచిపోవాలనే నేను కోరుకునేది." కళ్ళు తుడుచుకుంటూ నవ్విన మాణిక్యం శారద మనస్సులో ప్రత్యక్షమయింది!

'మాణిక్యం, ఓ పురుషునిచేత ఇంతగా ఆరాధింపబడిన నీవు నిజంగా ధన్యురాలవు. ఒక వ్యక్తిని ఆరాధించిఆవ్యక్తి చేత ఆరాధించబడి, ఆతనికోసం తన సర్వస్వాన్ని త్యాగంచేసే నీ వంటి స్త్రీ. . . . దేవతకాక మరెవరు?' అని మనస్సులో జోహారు అర్పించింది శారద. ఆమె శరీరం పులకించి కళ్ళ నీళ్ళు తిరిగాయి.

ఆ రోజే శారద ఇలా ఉత్తరం వ్రాసింది:

"మాణిక్యం!

నీ చినబాబు నీవన్నట్టు నిజంగా పసివాడే! తనకథ నంతనీ ఏమీ దాచకుండా నాకు చెప్పి తనవల్ల నాకు సుఖముండదని బాధపడ్డాడు. తన్ను గురించి తాను పట్టించుకొని పురుషుణ్ణి స్త్రీ ఎప్పుడూ ప్రేమిస్తుం దని ఎక్కడో చదివాను. అందుకు నీవే ప్రత్యక్ష నిదర్శనం. స్త్రీలా పురుషుడు జీవితాన్ని పూర్తిగా అర్థం చేసుకోలేడు.

నీకోసమయినా నీ చినబాబు జీవితంలో ప్రవేశించా లన్న కోరిక నాలో ఇప్పుడు మరింత బలపడింది. నాన్నగారు రాజా నాన్నగారితో పెళ్ళిమాటలు పూర్తిచేసుకొని రావటానికి మరో రెండు రోజులు పడుతుంది. ఈ రెండు రోజుల్లో రాజాని సుముఖుణ్ణి చేసుకోగలనన్న నమ్మకం నాకుంది. అంతవరకు నువ్వు మా అమ్మని కొంచెం కనిపెట్టుకొని ఉండు. గోపీ, చెల్లాయి స్కూలుకి వెళ్ళి జాగ్రత్తగా చదువుకుంటున్నారని తలుస్తాను. మీ అమ్మకు నా నమస్కారములు. మంచివాళ్ళకు దేవుడెప్పుడూ మంచే చేస్తాడు.

రాజా అన్నట్టు నీ మనస్సు మల్లెపూవులా తెల్లనైనది, స్వచ్ఛమైనది, ఆకర్షణీయమైనది. తన అందంతో మల్లెపూవు ఇతరుల్ని ఆకర్షించి ఆనందింపజేస్తుంది; అందరిచేత పూజలందుకుంటుంది! నీవూ అంతే!

త్వరలో మేమిద్దరమూ జంటగా నీ ఆశీస్సులందుకో టానికి వస్తాము. ఉండనా మరి!

—నీ శారద." ★